


ఆజాతశత్రువు ధర్మ భిక్షం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 27 మార్చి , 2026 | పేజీలు : 07

# అంగన్‌వాడీలే సమాజానికి అసలైన పునాది

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, గర్భిణీలకు అండగా నిలుస్తున్న అంగన్వాడీ టీచర్లు , హెల్పర్లు సమాజ అభివృద్ధికి అసలైన పునాది వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కొనియాడారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అంగన్వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్వాడీ కార్యకర్తలు గత 4050 ఏళ్లుగా నిరుపేదలకు సేవలు అందిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో పసిపిల్లల ఆరోగ్యం, విద్యాబోధనతో పాటు గర్భిణీలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడీల పాత్ర వెలకట్టలేనిదని, ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో వారు కీలక వారధులుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత దశాబ్ద కాలంలో తమ జీవితాలు మారుతాయని అంగన్వాడీలు ఎంతో ఆశగా ఎదురుచూశారని, కానీ ఆశించిన స్థాయిలో వారి స్థితిగతులు మెరుగుపడలేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం విపరీతంగా పెరిగినప్పటికీ, దానికి తగ్గట్టుగా వేతనాలు పెరగకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ హక్కుల కోసం వారు సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం తక్షణమే స్పందించి అంగన్వాడీలకు నెలకు రూ.18,000 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు పీఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ సదుపాయం కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ, అంగన్వాడీ అక్కచెల్లెమ్మల కష్టాన్ని గుర్తించి వారికి తగిన గౌరవం, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విజ్ఞప్తి చేశారు.

# పశువైద్య సేవల బలోపేతానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు

**కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పశువైద్య సేవల బలోపేతానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రతి ఇంట్లో లాభాల పాడి వెలుగులు నింపడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మెరుగైన వైద్య సేవలు చేస్తామని చెప్పారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశువైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల ఆరోగ్యం జాతి అభివృద్ధికి కృత్రిమ గర్భదారణ, ఆడ దూడల కోసం లింగ విభజన, టీకాలు మొదలగు వినూత్నంగా సేవలు అందించాలన్నారు. జిల్లాలో అన్ని పశువైద్యశాలల్లో ప్రజా సమాచారం కోసం అడ్రస్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, క్షౌరాలయ నిర్మాణం, ఆపరేషన్ పరికరాలను సమకూరుస్తామని చెప్పారు. కోదాడ, చిలుకూరు ఆసుపత్రులలో అల్ట్రాసౌండ్ కలర్ డాప్లర్ స్కానింగ్ యంత్రాలకు నిధులు ఇచ్చామని తెలిపారు. 50 పశు వైద్య శిభిరాలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఆసుపత్రుల వైద్యులకు కుర్చీలు, ఉపాధి హామీలో పశువుల కొట్టాల మంజూరి తక్షణమే ఇవ్వడం జరిగిందన్నారు. సమాజంలో నేటికి 98.7 శాతం ప్రజలు పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గ్రుడ్లు ఆహారం తీసుకుంటున్నారని చెప్పారు. పశు వైద్యం పటిష్టంగా ఉండాలని ఇకపై ఆకస్మిక తనిఖీలు చేపడుతామని చెప్పారు. చికిత్స కన్నా నివారణ మేలన్న సామెతను అనుసరించి పశువైద్యం కన్నా ప్రాముఖ్యమని జిల్లా పశువైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంరక్షన అధికారి డాక్టర్ బి శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ వెంకన్న, డాక్టర్ పి పెంటయ్య, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

**డబుల్ బెడ్ రూం ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని కేసారం వద్ద నిర్మించిన నూతన డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధిత కాంట్రాక్టర్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, హౌజింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం నిర్మించిన రెండు పడకల ఇండ్లలో తాగునీరు, విద్యుత్ సదుపాయాలు నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వాటర్ ట్యాంకులకు కనెక్షన్‌లు పూర్తిచేసి నీటి సరఫరా చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యరాకుండా చూడాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్నతో కలిసి పర్యటించి ట్యాంకులను పరిశీలించి నీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఈ రమేష్, ఏఈలు నవీన్, మహేష్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు ముడావత్ తనేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## బిఎల్‌ఓలకు శిక్షణ

**ప్రజాపక్షం/నూతనకల్ :** అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ జాబితాలో చేరేలా బిఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్ శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వే నిర్వహణ నూతన ఓటరు నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## ఎడమ కాలువలో జారి మహిళ గల్లంతు

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన నాంపల్లి భారతమ్మ (40) అనే మహిళ ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు జారి గల్లంతైన ఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం,భారతమ్మ భర్త రామలింగయ్య. గురువారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో బట్టలు ఉతకడానికి ఎడమ కాలువకు వెళ్లిన ఆమె కాలు జారి కాలువలో కొట్టుకుపోయింది.ఈ ఘటనను గమనించిన గ్రామస్తులు వెంటనే ఎస్ఐ వీరశేఖర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.మహిళ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## రోడ్డు వినియోగించే సమయంలో జాగ్రత్త




**ప్రజాపక్షం/చివ్వెంల :** ఉజ్వలమైన, ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని నిరంతరం కృషి చేస్తే మంచి విజయాలు వస్తాయని, పాఠశాలలు దేవాలయాలు, తరగతి గదులు ప్రయోగశాలలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పి కె నరసింహ అన్నారు. గురువారం దురాజుపల్లి గ్రామం వద్ద ఉన్న ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ నందు చివ్వెంల పోలీసులు, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నందు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మంచి లక్ష్యాలు ఎంచుకోవడం, ప్రణాళికతో చదువుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, పోలీస్ కళా బృందం వారు విద్యార్థులు రక్షణ, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, షీ టీం ఎస్ఐ నీలిమ, ఎంఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## చిన్న పిల్లాడిపై వీధి కుక్కల డాడీ

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి తారక రామ్ నగర్‌లో హృదయ విధారక ఘటన గురువారం చోటుచేసుకుంది. ఇంటి ముందు ఆడుతున్న ఓ చిన్న పిల్లాడి పై వీధి కుక్కల డాడీ చేశాయి. కుక్కల దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుని కన్ను గుడ్డు బయటకు వచ్చింది. ఇది గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఏరియా ఆస్పత్రి తీసుకవచ్చారు. ప్రస్తుతం బాలుడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



## వీరయ్య మృతి బాధకరం

ప్రజాపక్షం/మునగాల: కాసాని వీరయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి, నాయకులు నల్లపాటి శ్రీనివాస్ లు అన్నారు. గురువారం మునగాల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసాని వీరయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్ వీరయ్య మృతదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కొమ్ము ఈదారావు, ఉప సర్పంచ్ కాసర్ల వెంకట్, కాసర్ల కోటేశ్వరరావు, కొండా రామంజీగౌడ్ ఉన్నారు.

## పూజా సామాగ్రికి విక్రయానికి వేలంపాట

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో శ్రీస్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఒక సంవత్సరం పాటు కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, పూలు, పండ్లు అమ్ముకం, కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు పొందేందుకు శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చిట్టిప్రోలు సత్యనారాయణ, దేవాలయ కమిటీచైర్మన్ పాలిశెట్టి శ్రీనివాస్ లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల వారు పదివేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నాలని సూచించారు.

## హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని వేంచేసిన శ్రీ పార్వతి భీమలింగేశ్వర స్వామి దేవస్థానమునలకు భక్తుల కానుకల ద్వారా 3నెలల 20 రోజులకు హుండిలో వచ్చిన కానుకలను పర్యావేక్షణ అధికారి చలపతి సమక్షంలో గురువారం హుండిలు తెరిచి లెక్కించగా రూ. 48253 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. హుండి లెక్కింపు కార్యక్రమంలో కీతా మల్లిఖార్జున్‌రావు, చిన్నం సురేష్; కంచర్ల శ్రీనివాసరెడ్డి, పానుగుబాటి అశోక్, అర్చకులు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

## శివంగి ఉమెన్ పవర్‌గా కొండ జయమ్మకు పురస్కారం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మహిళా శక్తికి, పట్టుదలకు నిదర్శనంగా మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండ జయమ్మ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పీపుల్ మీడియా పాయింట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు వందనం కార్యక్రమంలో ఆమెకు శివంగి ఉమెన్ పవర్ ఆత్మీయ పురస్కారం 2026 ప్రధానం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆమె కనబరిచిన అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది.




## భీక్యతండ వీధులు బురదమయం



ప్రజాపక్షం/మోతె : మండలంలోని భీక్యతండ గ్రామ పంచాయితీలోని వీధులన్ని బురద మయంతో నిండుకొని నిత్యం గ్రామస్తులు గ్రామంలోని వీధులలో నడిచే పరిస్థితి లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండకాలంలో వీధులు బురద కావడం ఏమిటని ఎవరికైనా కలిగే అనుమానం, కానీ గ్రామంలో పలు ఇండ్లలో వాడుకున్న నీటితో వచ్చిన వరదతో వీధులు బురదమయం అవుతున్నాయి. పోటీపడి మరి నీటిని వృధా చేస్తూ ఇంట్లో వాడిన నీరు వరద పారుతున్న ఎవరికి పట్టనట్లు చూస్తున్న గ్రామ పంచాయితీ పాలకవర్గం. గ్రామ పంచాయితీ కార్యదర్శికి తెలియజేసిన ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో బురదతో ఈగలు, దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏ బజారు చూసిన బురదమయం : మదారు**

మా గ్రామంలోని ఏ బజారు చూసిన బురదతో పిచ్చి మొక్కలతో కంపుకొడుతుందని గ్రామ నివాసి హాలవత్ మదారు ప్రజాపక్షంకు తెలిపారు. లక్షలు పెట్టి ఇండ్లు కట్టుకున్న ఇంటి ముందు బురదతో ఇబ్బందులు పడుతున్న మాకు ఈ బురద బెడదతో విముక్తి కల్పించి చుట్టుపక్కల ఇండ్ల నుంచి రోడ్డు మీదకు వృధాగా వచ్చే వరద నీటిని ఆపివేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

## ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్సిబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి



ప్రజాపక్షం/భువనగిరి : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్సిబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ కమిటీ నాయకులు పలువురు మాట్లాడారు. భువనగిరి విద్యుత్తు డివిజన్ ఆఫీసు ముందు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగ సంఘాలు 1104, 327, టిఆర్‌వికెఎస్, బిసి అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సంఘాలు మద్దతు తెలుపుతూ మిగిలిపోయిన అన్మాండ్ కార్మికులు, సొసైటీ కార్మికులను ఆర్టిజన్‌గా గుర్తించాలని కోరారు. పీసు రేటు కార్మికులు ప్రవేట్ కలెక్షన్ ఏజెంట్లు, ప్రైవేట్ మీటర్ రీడర్లు, ఎస్పీఎం కార్మికులు, హమాలీలు కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని తెలిపారు. అలాగే 2026 పి ఆర్ సి కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్పీడీసీఎల్ కంపెనీ కో చైర్మన్ బొక్క పాండరీ రెడ్డి, బొబ్బిలి మురళి, ఉమ్మడి జిల్లాకు చైర్మన్ భాస్కర్ నాయక్, భువనగిరి డివిజన్ చైర్మన్ ఇంజ మహేష్, కో చైర్మన్ ఎర్ల వెంకటేశు, కన్వీనర్ బోట్ల రమేష్, కో కన్వీనర్ హరికృష్ణ, సాగిన రమేష్, భువనగిరి సబ్ డివిజన్, బింగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా నిర్వహించిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరు కావడానికి వెళ్లుతుండగా పోలీసులు అడ్డుకుని గురువారం తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు డివైఎఫ్: పట్టణ కమిటి కార్యదర్శి మాసాల వీరబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువత గళాన్ని అణిచివేయడానికి అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూత్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి నెలకు రూ.4వేలు ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, క్రీడాభివృద్ధికి వేయికోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరాల నరేష్, రామల అనిల్, నక్కిబోయిన శంకర్, గొబ్బి రాము, సాయి, సైదులు పాల్గొన్నారు.

## అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు మలక్‌పేట యశోద ఆసుపత్రి వైద్య బృందంతోనే సాధ్యం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు మలక్‌పేట యశోద ఆసుపత్రి వైద్య బృందంతోనే సాధ్యమని ఆసుపత్రి మెడికల్ అంకాలజిస్ట్, హిమాటో అంకాలజిస్ట్ డాక్టర్ జి.వంశీకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాకు చెందిన 20 ఏండ్ల యువకుడు జ్వరం, దంతాల నుంచి రక్తస్రావం, తల నిర్బందం, శరీరంపై రక్తస్రావ మచ్చలతో యశోద ఆసపత్రిలో చేరాడని, పరీక్షల్లో తీవ్ర ప్లేట్‌లెట్ లోపం, రక్త సంబంధిత అసమానతలు గుర్తించబడ్డాయన్నారు. పరీక్షలు నిర్వహించగా రోగికి అక్యూట్ ప్రోమైలోసైటిక్ లుకేమియా నిర్ధారణ అయిందని, రోగికి ఏటీఆర్‌ఏ ఆర్సెనిక్ ఆధారిత ఇండక్షన్ కేమో థెరపి అందించడంతోపాటు పీఆర్‌బీసీ ప్లేట్ లెట్ ట్రాన్స్‌లేషన్, క్రయో ప్రెసిపిటేట్, యాంటి బయోటెక్స్, యాంటి ఫంగల్స్ నిరంతర వైద్య పర్యవేక్షణ అందించడం జరిగిందన్నారు. నేత్ర న్యూరో ఈఎన్‌టీ నిపుణుల సూచనలతో కంటి వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించామన్నారు. సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదర, వీఆర్‌వో ఎ.వాసుకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## గ్రామాభివృద్ధికి నిరంతరం పనిచేస్తా

ప్రజాపక్షం/మునగాల: గ్రామాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని నర్సింహపురం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సింహపురం గ్రామంలో నర్సింహపురం నుండి ఆర్లెగూడెం వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పెంటదిబ్బలను జెసిబి సాయంతో తొలగించారు. అనంతరం వైకుంఠదామును శుభ్రం చేయించినట్లు తెలిపారు. అలాగే నర్సింహపురం నుండి కట్టకొమ్ముగూడెం వెళ్లే రహదారి కూడా కంపచెట్లతో నిండి ఉండటం వల్ల ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడేవారని ఈ రోజు రహదారిని బాగు చేయించడం వల్ల వారి ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డు సభ్యులు అజీజ్ మియా, మీసాల భిక్షం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : బాలల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి, బాలల పరిరక్షణ విభాగం, సోషల్ వర్కర్ వి. శ్రీలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మిషన్ వాత్సల్య పథకం, బాలల చట్టాలపై గ్రామ సర్పంచ్ అధ్యక్షతన అవగాహన కల్పించి వివిధ శాఖలతో గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ రవి, గ్రామ ఉపసర్పంచ్ గుండెబోయిన జానయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వప్న, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ డి కిరణ్ పాల్గొన్నారు.

## 28న ఉచిత మెగా హెల్త్ క్యాంప్

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఈనెల 28వ తేదీన పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిపుణులైన వైద్యుల సేవలను గ్రామీణ ప్రజలకు అందించడమే లక్ష్యంగా ఈ శిభిరం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో స్త్రీల, చిన్నపిల్లల, కంటి, పంటి, ఎముకల, సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించి అనుభవజ్ఞులైన స్పెషలిస్ట్ వైద్యుల బృందం పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. ఈ శిభిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సేవలు పొందగోరే వారు తమవెంట తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకురావాలని కోరారు.

## జీవితంలో ఆర్థిక క్రమశిక్షణ అవసరం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీరెల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ జడ్పి ఉన్నత పాఠశాల నందు ఆర్థిక క్రమశిక్షణ కార్యక్రమంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. బడ్జెట్ అంటే ఏమిటి క్రెడిట్, డెబిట్, సేవింగ్ పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు వేముల శ్రీనివాస్, మిరియాల అనూష, మహ్మద్ జానీ, వెంకటయ్య, వెంకటేశ్వరరావు, కెవి సత్యనారాయణ, జయమ్మ, లావణ్య,ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.





## తీర్పును పునః సమీక్షించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదని ఇటీవల వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించాలని తెలంగాణ మాదిక హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగన్న సూచించారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం ఆధారంగా వివక్షత చూపరాదని, ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడికి తనకిచ్చిన మతాన్ని అనసరించే స్వేచ్ఛను, హామీని ఇస్తుందన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రజాపక్షం/గుండాల; తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా వికలాంగులకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు పెన్షన్‌లను పెంచుతామని నేటికి పెన్షన్లను పెంచకుండా మోసం చేసిందని, ఎన్నికల్లో హామీ ఇచ్చి నేటికి నేరవేర్చకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరికి నిదర్శనం అని జిల్లా దివ్యాంగుల వికలాంగుల హెల్పింగ్ సొసైటి అధ్యక్షులు సింగారపు రమేష్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షమనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు పెంచుతామన్న పెన్షన్లను తక్షణమే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సీతారాముల ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు



ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రక్తంగా మంగళ స్నానాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్ హాజరై,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల సుకన్య,స్వప్న,ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు

ప్రజాపక్షం/నకిరేకల్ : మండలంలోని తాటికల గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడేది ఐద్వా మాత్రమేనని తెలిపారు.సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నప్పటికీ ఇంకా వివక్ష కొనసాగుతుందన్నారు.మహిళలపై దాడులు, వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి,జిల్లా కమిటీ సభ్యురాలు బహూరోజు ఇందిర,పన్నాల శశికళ,చెనగోని జయమ్మ,పిట్ట లక్ష్మి,యాదమ్మ,పాల్గొన్నారు.

## రక్తహీనత మందులు పంపిణీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: అనీమియా ముక్త్ భారత్, ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిషియన్స్, అర్చన పిల్లల వైద్యశాల సంయుక్తంగా గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత రక్తహీనత మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ జి.అంజయ్య బాలికలకు ఉచితంగా మందులు పంపిణి చేసి మాట్లాడారు. ఇండియన్ పీడియాట్రిషన్ సంస్థల తమవంతు బాధ్యతగా ఉచిత మందులు పంపిణి చేయాలని నిర్ణయించామన్నారు. పేదిరకంతో రక్తహీనత సమస్యతో విద్యారిధనిలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను తమవంతుగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి సూది ఉపయోగించకుండా అధునాతన యంత్రం సహాయంతో కేవలం వేలిముద్ర ద్వారా రక్తం పర్సంటేజ్ నిర్ధారించామన్నారు. ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, పండ్లు, మాసం తినడంతో రక్తం నిల్వ పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, రజిత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 29న హైదరాబాద్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నా

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ధర్నాను శాంతియుతంగా నిర్వహిస్తామని, ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేసే వేదికగా దీన్ని ఉపయోగించుకుంటామని నిర్వాహకులు తెలిపారు.ఉద్యోగ భద్రత,సముచిత వేతనాలు,పర్మినెంట్ నియామకాలు వంటి డిమాండ్ల సాధన కోసం ఈమహా ధర్నా చేపడుతున్నామని వారు పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానల వేదికపై నాగయ్య,పేతరాజు, శంకర్, కె.ప్రగతి,ఉమ్ నిర్మల, నాగమ్మ, ఎ.రామలింగయ్య,ముత్యం రెడ్డి,అనిల్,సలిత, శివయ్య,రాం రెడ్డి, ధనలక్ష్మి,భువనేశ్వరి,రేణుక, మౌనిక, ఈ.ప్రకాష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అభ్యున్నతికి కృషి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: బార్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఏ. సతీష్ కుమార్ తెలిపారు. గురువారం నల్లగొండ కోర్టులో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సతీష్ కుమార్ ప్యానల్ ఘన విజయం సాధించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులందరూ సంపూర్ణ మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, అందరికీ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, ఏ.సంధ్యారాణి,ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన అశోక్ కుమార్,ట్రెజరర్ ఎండి ఫిరోజ్, గేమ్స్ సెక్రటరీ నారబోయిన ప్రసన్న కుమార్, ప్రముఖ న్యాయవాది జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



## కంప్యూటర్ నైపుణ్యంతో ప్రపంచ స్థాయి ఉద్యోగాలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కంప్యూటర్ సైన్స్‌లో నైపుణ్యం సాధిస్తే ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని నాగార్జునసాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ బొబ్బిలి రాజా తెలిపారు.నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ,పీజీ విద్యార్థుల కోసం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలు అంశంపై సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్,సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాలు ఉపేందర్ మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు దోహదం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వెంకటరమణ,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్,ప్రొఫసర్ అంతటి శ్రీనివాసులు,సిఓఈ డాక్టర్ డి. మునిస్వామి,అకాడమిక్ కోఆర్డినేటర్ బి.నాగరాజు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట యోధురాలు కామ్రేడ్ అనసూయమ్మ

ప్రజాపక్షం/గరిడేపల్లి: తెలంగాణ పోరాట యోధురాలు కామ్రెడ్ మేదరమెట్ల అనసూయమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో విరోచితంగా పోరాడిందని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, మండల కార్యదర్శి షేక్ యాకుబ్‌లు అన్నారు. గురువారం మండలంలోని వెలిదండ గ్రామంలో కామ్రెడ్ అనసూయమ్మ సంతాప సభ నిర్వహించారు.





## గురుకులానికి 15 మంది విద్యార్థులు

ప్రజాపక్షం/చిట్యాలః నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినీ, విద్యార్థులు గురుకుల వివిధ గురుకుల పాఠశాలల్లో అర్హత సాధించారు. 4వ తరగతిలో 18 మంది విద్యార్థులలో అందరూ గత ఫిబ్రవరిలో జరిగిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు వ్రాయగా అందులో 15 మంది 5వ తరగతికి గాను సీటు సాధించడం విశేషం. విద్యార్థుల విజయానికి మూల కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయులు మేడబోయిన పవన్‌కుమార్ తదితరులను గురువారం రోజున చిట్యాల మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోద, గ్రామ సర్పంచ్ శ్రీలతలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దామునూరి పృథ్వీ, లక్ష్మమ్మ, చొల్లేటి రవి, కృష్ణయ్య, సుక్క రాజ్‌కుమార్, మేడబోయిన వెంకన్న, బెల్లపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతకాలు సాధించిన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇటీవల ఖమ్మంలో సుమన్ షాటో ఖాన్ కరాటే అకాడమి వారు నిర్వహించిన 31వ జాతీయ స్థాయి పోటీల్లో లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. పి.స్నిగ్ధ, కె.సాయి, ఎ.శ్రీజ, వీణ, కె.ముకుందలక్ష్మి విద్యార్థులు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పథకాలు సాధించి పాఠశాల పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జిన్సీ జయరాజన్, ప్రధానోపాధ్యాయులు సుజయ్‌కుమార్, ఐఐటీ విభాగాధిపతి యరగాని ప్రసాద్, ప్రైమరీ ఇన్‌చార్జి రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే చదువు ముఖ్యమని పుస్తక జ్ఞానం పెంచుకోవడం ప్రతి ఒక్కరికి తప్పనిసరి అని దాని కోసం గ్రంథాలయాలు ఉపయోగపడ్తాయని వాటిని వినియోగించుకోవాలని మిర్యాలగూడ గ్రంథాలయ సహాయ అధికారి కుమ్మరికుంట్ల సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో వివిధ పుస్తకాలు, దినపత్రికలు, కథల పుస్తకాలు అందచేసి గ్రంథాలయ వినియోగం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

## సరస్వతి విద్యార్థుల ఆదర్శ ఫీల్డ్ ట్రిప్

ప్రజాపక్షం/నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ తెలుగు పాఠ్యాంశంలో ఉన్న ఇల్లిందల సరస్వతి దేవి తీయని పలకరింపు పాఠ్యాన్ని ఆచరణలో అనుభవిస్తూ గురువారం ఒక ప్రత్యేక ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు.ట్రిప్‌లో భాగంగా తాటికల్ శివారులోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించి నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు బ్రెడ్,పండ్లు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ మారుపాక నరసయ్య,ఏవో సురేష్, తెలుగు ఉపాధ్యాయుడు తండు అనిల్ కుమార్,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.





## మన ఊరు- మన బడి

**ప్రజాపక్షం/రామన్నపేట:** మండల పరిధిలోని నీర్నేముల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఉదయం పిల్లలతో కలిసి రాగిజావ తాగి, మధ్యాహ్నం వారితోనే కూర్చుని భోజనం చేయడం విశేషమని, పిల్లలకు అందుతున్న వసతులు, భోజన రుచి , నాణ్యతపై ఆయన చూపిన ఈ ప్రత్యేక శ్రద్ధ నిజంగా అభినందనీయం. ప్రజాప్రతినిధులు ఇలా నిరంతరం పర్యవేక్షించడం వల్ల పాఠశాలలో విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు మెరుగుపడతాయని, మంచి మనసుతో పిల్లల క్షేమం కోరిన సర్పంచ్‌కి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/బీబీనగర్ :** భువనగిరిలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 136వ ఉచిత వైద్య శిబిరం బీబీనగర్ పట్టణంలోని భవిష్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు బీబీనగర్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు బిపి, షుగర్ టెస్ట్‌లు నిర్వహించారు. డాక్టర్ సలహా మేరకు వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నందు జనరల్ ఫిజీషియన్, డాక్టర్ చావా రాజ్ కుమార్, దంత వైద్య నిపుణులు, డాక్టర్ చావా అశ్లేశ ప్రజలకు మధ్య పరీక్షలు నిర్వహించి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్కంఠ మధ్య రామన్నపేట బార్ అసోసియేషన్ ఎన్నిక

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట బార్ సోసియేషన్ ఎన్నికలలో మూడోసారి అధ్యక్షులుగా మజీద్, ప్రధాన కార్యదర్శిగా యాదాసు యాదయ్య పోటీపడగా విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించగా మెజారిటీతో అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక కావడం జరిగింది. ఉపాధ్యక్షులుగా సంగిశెట్టి బాలరాజు, సహాయ కార్యదర్శిగా దినేష్, కోశాధికారి కూనూరు శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్, లేడీ రిప్రెసెంటివ్ గా రోసమ్మ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాల్వంచ జగతయ్య, సోమ సతీష్ రెడ్డి, సయ్యద్ అజిజుద్దీన్‌గా ఎన్నికైనట్టుగా ఎన్నికల అధికారి యేళ్ల శ్రీశైలం ప్రకటించారు.



## క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే నివారణ సులభం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే నివారణ సులభమని ఎంఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత కొల్లు మధుసూదన్ రావు, కొంగర భవాని ట్రస్ట్ చైర్మన్ కొంగర రామచంద్రరావులు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ఎంఎస్ఆర్ కిడ్జ్ పాఠశాలలో స్వర్గీయ కొంగరి భవాని, ఎంఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిభిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. బసవతారకం క్యాన్సర్ ఆసుప్రతి హెచ్ ఓడి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌కు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 200 మందితో పాటు మరో 100 మందికి కూడా క్యాన్సర్ నిర్ధారణ




పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాసరావు, చేతన ఫౌండేషన్ చైర్మన్ సీతారామయ్య, డాక్టర్లు రవిశంకర్, శైలజ, మాన్విత, రేడియాలజిస్ట్ ప్రభాకర్, నర్సింగ్, టెక్నిషియన్ సిబ్బందితోపాటు సూర్యాపేట చందన నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల పంపిణికి ప్రజా ప్రభుత్వంలో మోక్షం



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని బొగ్గుల దోన స్టేజ్ (ఏనెకుంట వద్ద ) సర్వే నెంబర్ 61లో ఉన్న 4 ఎకరాలు ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాలను స్థానిక తహశీల్దార్ సమక్షంలో గ్రామ సర్పంచ్ బుద్దుల శ్రీవాణి శ్రీను, ఉప సర్పంచ్ అర్కపల్లి మమత ఈదమయ్య, సీనియర్ నాయకులు గండికోట ఈదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఇంచార్జీ శిగ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈసర్వేలో ఉమ్మడి బొగ్గులదోన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు (కాల్య తండా సర్పంచ్ అంగోతు తేజునాయక్, జేత్య తండా సర్పంచ్ రమావత్ కిషన్ నాయక్), ఫీల్డ్ అసిస్టెంట్ అర్కపల్లి హుస్సేన్, వార్డు సభ్యులు వరికుప్పల బాలరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా బొగ్గులదోన గ్రామ సర్పంచ్, గ్రామ శాఖ ఇంచార్జీ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ గత 35 సంతవ్సరాలుగా అమలుకు నోచుకోని ఈ ప్రభుత్వ భూమి (1991 లో ఇండ్ల స్థలాలకై కొన్న భూమి) యొక్క సర్వే , ఇండ్ల స్థలాలుగా మార్పు నేడు రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం వలన ఎంఎల్‌ఏ బాలునాయక్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావుల చొరవతో ఇన్నేళ్లకు కార్యరూపం దాల్చిందని, సుదీర్ఘ కాల పోరాటం అనంతరం ఈ కల సాధ్యమైందని పేర్కొన్నారు.

## సీతారాముల కల్యాణం ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రతి ఏటా నిర్వహించే సీతారాముల కళ్యాణోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు బీబీనగర్ పట్టణంలో గల శ్రీ వేణు గోపాల స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ పంజల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎదుర్కోలు, శుక్రవారం ఉదయం 10 గంటలకు వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం, శనివారం స్వామివారి రథోత్సవం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సీతారాముల కళ్యాణం ప్రముఖ వ్యాపారవేత దాచేపల్లి సోమయ్య గుప్తా, పంచముఖ హనుమాన్‌లో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి పంచలోహ విగ్రహాలను అందజేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి పంచముఖ హనుమాన్ వద్ద స్వామి వారి కళ్యాణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, ఉప సర్పంచ్ గోలి నరసింహారెడ్డి, విగ్రహ దాతలు దాచేపల్లి కిరణ్, దాచేపల్లి సంతోష్ పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల ప్రజలకు ఎన్నికల ముందు పాలకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి యండి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక హేమావతి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం మండల కమిటి సమావేశం అనంతుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సౌకర్యాలు కల్పిస్తామని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గుండాల నూనెగూడెం గ్రామాల మధ్య వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సాగునీటి కాలువులు పూర్తి చేస్తామని, గుండాల బస్టాండ్, సబ్ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యలు హామీ ఇచ్చారని తక్షణమే ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేషం, జిల్లా కమిటి సభ్యులు యాదగిరి, మద్దెపురం రాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు, ఖలీల్, బిక్షం, అబ్బయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 1న చండూరు తైబజార్ బహిరంగ వేలం

**ప్రజాపక్షం/చండూరు:** వచ్చే నెల 1న చండూరు తైబజార్‌కు బహిరంగ వేలం ను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ మల్లేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తైబజార్ బహిరంగ వేలంలో పాల్గొనుటకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేది నుండి 31 వ తేదీ వరకు చండూరు మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పిచవలసి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు ఫారాలు మున్సిపల్ కార్యాలయం పనివేళలో 2వేల రూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలని సూచించారు. వేలం కాల పరిమితి ఒక సంవత్సం అనగా 1 ఏప్రిల్ 2026 నుండి 31 మార్చి 2027 వరకు ఉంటుందని అన్నారు. వేలం పాటలో పాల్గొనువారు పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటో , రెవిన్యూ అధికారి నుండి  గాని లేదా ఎదైన జాతీయ బ్యాంక్ నుండి 5లక్షల పై బడిన దృవీకరణ పత్రము తో ఆధార్ కార్డు ,ఓటరు కార్డు , పాన్ కార్డు నఖలుతో డిమాండ్ డ్రాఫ్ట్ దరఖాస్తుకు జతపర్చి మార్చి 31 సాయంత్రం 3 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వేలములో పాల్గొనువారు ధరావత్ సొమ్ము అదనంగా 25వేలు రూపాయలు నగదు  డిపాజిట్ చేయాలని కమీషనర్ మల్లేశం  తెలిపారు.

## భువనగిరి జిల్లాకు సాంబశివుని పేరు పెట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆదివాసి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి జనజీవనంలోకి వచ్చిన తర్వాత కూడా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తి సాంబశివుడు అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్,20 వ డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ లు ఆయన సేవలను   కొనియాడారు. బిఆర్ఎస్ మాజీ పొలిట్ బ్యూరో  సభ్యుడు,మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కొనపురి సాంబశివుడు 15వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని గడియారం సెంటర్లో గల అమరవీరుల స్థూపం వద్ద యాదవ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చల్లా కోటేష్ యాదవ్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో  విద్యావంతులు వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజ్ యాదవ్,మహిళా అధ్యక్షురాలు మామిడి పద్మ, బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొమ్మర బోయిన నాగార్జున, కట్ట శ్రీనివాస్,జిల్లా యాదవ సంఘం నాయకులు కన్నెబోయిన అంజిబాబు పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగ దివ్య దర్శనం పూర్వజన్మ పుణ్యఫలం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన సోమనాథ్ మూల విరాట్ జ్యోతిర్లింగ దివ్యదర్శనం పూర్వ జన్మ పుణ్యఫలమని సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రవి మహల్‌లో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోమనాథ్ మూల విరాట్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. భారతదేశంలోని మొదటిదైన వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని గజని మహ్మద్ ధ్వంసం చేసిన తరువాత అందులోని మూల విరాట్ జ్యోతిర్లింగాన్ని అగ్నిహోత్రి బ్రాహ్మణులు గోప్యంగా దాచి నేటి వరకు పూజలు నిర్వహిస్తున్నారన్నారు.  ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చలమల్ల నరసింహ, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ సభ్యులు వంగవీటి రమేష్, బుద్ధ బిక్షపతి, సందీప్, బాణాల శ్రీనివాస్, రాధాకృష్ణ భరద్వాజ్, నాగరాజు పాల్గొన్నారు.



## నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా శ్రీరామ నవమిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవమి రోజు ప్రతి ఏటా వైభవోపేతంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకుంటారని అన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ఆయన కోరారు.

## పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/డిండి;** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర మరువలేనిదని ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట పల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేష్, శ్రీకాంత్, కళావతమ్మ, మంజుల, ప్రమీల పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నూనె సురేష్



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ కోర్టు బార్ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికల్లో నూనె సురేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ నూనె సురేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులందరికి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకొండ బార్ అసోసియేషన్ అభివృద్ధికి,న్యాయవాదుల సంక్షేమానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కారం కోసం వారి హక్కుల పరిరక్షణ కోసం బార్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**ప్రజాపక్షం/త్రిపురారం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎంపీడీవో విజయ్ కుమారి పేర్కొన్నారు.గురువారం ఆమె త్రిపురారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ఈసందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రవి నాయక్,పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



## దుండగులు పశువులను అపహరణ- రైతులకు భారీ నష్టం



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల కేంద్రంలో దుండగులు పశువులను అపహరించిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది.మండలానికి చెందిన రైతు కొత్తగొల్ల శంకరయ్య పశువుల కొట్టంలో ఒక ఆవు,ఒక కోడె ఉండగా,అలాగే పెరుమాండ్ల శ్రీనయ్య పశువుల కొట్టంలో ఒక ఆవుపెయ్యను కట్టేసి ఉంచారు.బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఈమూడు పశువులను అపహరించి, ఆటోలో తరలించినట్లు సమాచారం. ఉదయం పశువులు కనిపించకపోవడంతో రైతులు వెతకగా విషయం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అపహరించబడిన పశువుల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని రైతులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇటీవల ఇలాంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రాత్రి పహారా పెంచాలని, దుండగులను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరుతున్నారు.

## గ్రామ నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/త్రిపురారం:** గ్రామ అభివృద్ధికి వచ్చే నిధులను దుర్వినియోగం చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ హెచ్చరించారు.గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో వచ్చిన నిధుల వినియోగంపై గత సర్పంచులు, ప్రస్తుత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.అనంతరం దుగ్గేపల్లి నర్సరీని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ పంచాయతీ అధికారి రాఘవరావు, ఎంపీడీవో విజయ్ కుమారి,ఎంపీఓ వల్లాల శివ,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పైపులను తొలగించాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కాలువ దాటడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా కాలువలో ఉన్న పైపులను తొలగించాలన్న ప్రతిపాదనను స్థానిక ఎమ్మెల్యే, అధికారులు విరమించుకోవాలి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా తెలిపారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని, కాలువలో ఉన్న పైపులను అక్రమంగా తొలగించవద్దని గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులతో కలిసి కాల్వ దగ్గర నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గ్రామ ఉప సర్పంచ్ అందె మల్లేశం, వార్డు మెంబర్లు జక్కుల మల్లేశం, కొండమడుగు అశోక్, గజ్జి కవితా కుమార్, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండా అశోక్ పాల్గొన్నారు.

## సాంబశివుడు వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** స్వర్గీయ కోనపురి సాంబశివుడు వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వలిగొండ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోనపురి కవిత రాములు, శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్ అన్నారు. స్వర్గీయ కోనపురి సాంబశివుడు 15వ వర్ధంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పువ్వుల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యకులు గుండెబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, బెల్లి సూర్య ప్రకాశ్ యాదవ్, ర్యాకల రమేష్ యాదవ్, పర్వతం దశరథ పాల్గొన్నారు.



## మహిళా రైతు సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/రామన్నపేట :** మార్చి 31న రామన్నపేటలో జరిగే తెలంగాణ రైతు సంఘం మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరగబోయే రాష్ట్ర సదస్సు ప్రచారంకై గోడ రాతలు రాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామన్నపేటలో జరగబోయే రైతు మహిళా సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 250 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, మహిళా రైతుల ఎదుర్కొనే సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని, మండల రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేయడం జరుగుతుందన్నారు. ఈ రాష్ట్ర సదస్సుకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ తదితర రాష్ట్ర నాయకత్వం హాజరవుతున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.



## బహిరంగ చర్చకు సిద్ధమా

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం):** మండల కేంద్రం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్ఆర్‌జిఎస్ కింద మండల కేంద్రంలో ఉపాధి కూలీలు రూ.3 కోట్ల 33 లక్షల పనిచేశారు. అందులో 40 శాతం లేబర్ కాంటినెంట్ కింద రూ.1.కొటి 45 లక్షలు మండలానికి రావడం జరిగింది. కానీ అట్టి నిధులను కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన సర్పంచులకు మాత్రమే ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా 10 గ్రామాలు టిఆర్ఎస్, బిజెపి గెలిచిన సర్పంచ్లకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దానికి వ్యతిరేకంగానే రెండు రోజుల క్రితం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ సర్పంచ్ ఉన్న దగ్గరే ఎన్ఆర్‌జిఎస్ నిధులు విడుదల చేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ మండల నాయకుల్లారా ఖబర్దార్ రండి... బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ జనరల్ పంజాల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బిజ్జాల సోమరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పహాడీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** 30వ వార్డు పహాడీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ ఎండి.లయిక్ అహ్మద్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కొరుతూ మున్సిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవానికి కౌన్సిలర్ ఎండి.లయిక్ అహ్మద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అత్యవసరంగా ఒక మినీ ట్యాంకు అవసరం ఉందని తెలిపారు. పలు కాలనీలలో మురికి కాలువలపై స్లాబు అవసరం ఉందని వారు తెలిపారు. కావున ఇట్టి పనులను అత్యవసరంగా భావించి మున్సిపల్ ఎజెండాలో చేర్చాలని వారు చైర్ పర్సన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ సుబ్బయ్య తబస్సు షఫీక్ అహ్మద్, నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్, ఎండి.సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## యోగశిక్షణా తరగతుల గోడపత్రిక ఆవిష్కరణ




**ప్రజాపక్షం/రామన్నపేట :** శ్రీ శిరిడి సాయి అష్టాంగ తొమ్మిది రోజుల యోగశిక్షణా తరగతులు రామన్నపేటలో ఉన్నటువంటి అమృతవనం అగ్రిఫామ్ రిసార్ట్లో 29వ తేదీ నుండి 6వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతున్నది. ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7:00 గంటల వరకు సాయంత్రం 6:30 నుండి 8:00 గంటల వరకు శిక్షణ నిర్వహించబడును. ఈ శిక్షణ తరగతుల బ్రోచర్‌ను గౌరవనీయులు రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ డి.నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు యోగేశ్వర్, అమృతం అగ్రిఫామ్ రిసార్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కడారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనదలచిన వారు ఈ కింది 9603256572 నెంబర్‌ను సంప్రదించగలరని తెలిపారు.

## సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ రామన్నపేట :** మండల పరిధిలోని శోభనాద్రిపురం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి గుడి నుండి కాల్య శంకరయ్య ఇంటి వరకు నూతనంగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ శ్రీ కంచి మధుసూదన్ శంకుస్థాపన చేశారు.



## ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

**ప్రజాపక్షం/నూతనకల్** : ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ నాగరాజు అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## మానవ జన్మ అద్భుతమైనది




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : మానవ జన్మ అద్భుతమైనదని విద్యార్థిని, విద్యార్థులు జీవితాన్ని వృధా చేసుకోవద్దని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో గురువారం ఎస్ఎల్ఎస్ స్కాలర్స్ స్కూల్ కరస్పాండెంట్ చీకూరి సాయికృష్ణ రేవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేపటి పౌరుల నిర్మాణం వ్యాఖ్యాత, భారతదేశ ప్రఖ్యాత వక్త వేణుకళ్యాణ్ ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రముఖ వైద్యులు ఊర రామ్మూర్తి యాదవ్, ఈద ప్రవీణ్, బైరు శైలేందర్ గౌడ్, ఎస్ఎల్ఎస్ స్కాలర్స్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : అసెంబ్లీలో ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్నారం గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మట్టిపెల్లి వెంకట్, మన్నూరు పోతరాజు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు స్థానిక తహాశీల్దార్ సూరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మోర్తాల సీతారెడ్డి, మాలవతు శారద సామ్య, దొండపాటి వెంకటరెడ్డి, బుజ్జి హుస్సేన్ పాల్గొన్నారు.

## మహిళా కోలాట పోటీలకు ఘన శ్రీకారం



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్**: తిరుమలగిరి మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల మహిళా కోలాట పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను నాగార్జునసాగర్ సీఐ శ్రీను నాయక్, స్థానిక గ్రామ సర్పంచ్ పగడాల పున్న సైదులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శాగం పెద్దిరెడ్డి పద్మ,దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాగం మంగమ్మ,మాజీ సర్పంచ్ చెవ్వ నాసర్ రెడ్డి,పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల నాసర్ రెడ్డి,మాజీ సర్పంచ్ ఇరిగి గంగయ్య, శాగం అంజి రెడ్డి,నాగెండ్ల కృష్ణారెడ్డి, చెవ్వ వీరారెడ్డి,అనుముల చిన్న బిక్షం, ఎస్‌కే సుభాని,నల్లబోతు సైదులు,పసు పులేటి కృష్ణ, మహేశ్వరం రాంబాబు, నర్సింగ్ వెంకన్న,నల్లబోతు వెంకటేశ్వర్లు, విక్కీ, పావని, రహీం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ఉన్న లైన్‌లను అనుసరించాలి




**ప్రజాపక్షం/తుంగతుర్తి** : రోడ్లపై ఉన్న లైన్‌లను అనుసరించి ప్రయాణించాలని ప్రయాణికులకు ఎస్ఐ క్రాంతి సూచించారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాన కార్యక్రమం నిర్వహించి ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలు అడ్డుకట్ట వేయాలి

**తప్పనిసరి డ్రా పద్ధతిలోనే ఎంపికలు జరపాలని: తల్లమల్ల యాదగిరి**



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: జిల్లా సిపిఓ పరిధిలో జనాభా లెక్కల సేకరణ కోసం కేటాయించిన 45 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లమల్ల యాదగిరి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నియామక బాధ్యతలు చేపట్టే ఏజెన్సీల ఎంపికలో నిష్పక్షపాత విధానాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు.నియామకాల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా,డ్రా పద్ధతిలోనే ఎంపికలు జరపాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు.అర్హత,పారదర్శకత ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని తెలిపారు.జిల్లాలోని నిరుద్యోగులకు సమాన అవకాశాలు కల్పించాలంటే నియామక ప్రక్రియను స్పష్టంగా,నిష్పక్షపాతంగా నిర్వహించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈవిషయంపై ప్రత్యేక దృష్టి సారించి,పారదర్శక నియామకాలు చేపట్టాలని కోరారు.

## పెట్రోల్ డీజిల్ కొరతపై వదంతులు నమ్మవద్దు

**ప్రజాపక్షం/అర్వపల్లి** : పెట్రోల్ డీజిల్ కొరతపై ఎటువంటి వదంతలు నమ్మకూడదని మండల తహాశీల్దార్ బి శ్రీకాంత్, ఎస్ఐ ఈ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పెట్రోల్ బంక్‌ను పోలీసు, రెవెన్యూ అధికారులు సందర్శించి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విడిగా పెట్రోల్, డిజిల్ ఎవరు అమ్మకూడదని అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్ నిల్వలు తగినంతగా ఉన్నాయని ఆందోళన అవసరం లేదన్నారు. ఎవరు కూడా పెట్రోల్, డీజిల్ స్టాక్‌పై అవస్తవాలను ప్రచారం చేయవద్దని సోషల్‌మీడియాలో పెట్టవద్దన్నారు.

## బిఎల్‌ఓల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ఓటర్ల జాబితా సవరణలో బిఎల్‌ఓల పాత్ర కీలకమని మండల తహాశీల్దార్ బి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం రైతు వేదికలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బిఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లలో ప్రతీ ఇంటికి వెళ్ళి ఆధార్, ఫోన్ నంబర్, మరణించిన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి యాగాన్ని విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: లోక సౌఖ్యం కోసం నేటి నుంచి జరగనున్న శ్రీ మహాలక్ష్మి యాగాన్ని విజయవంతం చేయాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యాగాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా ప్రజల సౌఖ్యం కోసం మిర్యాలగూడలో మొట్టమొదటిసారిగా ఐదు రోజుల పాటు యాగాలు జరుగుతున్నందున మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాగ నిర్వాహకలు పురుషోత్తంరెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రావు, వెలుగు నాగరాజు, మిట్టపల్లి సత్యనారాయణ, మిట్టపల్లి అశోక్, మధుసూదన్‌రెడ్డి, గందె రాము పాల్గొన్నారు.



## ఎస్‌సి యువత వార్షిక ప్రణాళిక దరఖాస్తులు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 202526 కింద వివిధ పథకాల అమలు చేయుటకు ఆర్థిక సహాయం పొందుటకు అర్హులైన షెడ్యూల్డ్ కులాల వారు ఆన్‌లైన్ ద్వారా 26.03.2026 నుండి 02.04.2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఎస్‌సి యువతి యువకులు https://tgobmms.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన దరఖాస్తును అభ్యర్థి డౌన్‌లోడ్ చేసుకొని, దానికి అవసరమైన పత్రాలను జతచేసి, సంబంధిత మండలం/మున్సిపాలిటి కార్యాలయాలలో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సూర్యాపేట శ్రీశైలం ఆర్‌టిసి బస్సు సమయాల్లో మార్పు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట నుండి శ్రీశైలంకు వెళ్ళే ఆర్‌టిసి బస్సు సమయాల్లో మార్పు చేసినట్లు సూర్యాపేట డిపో మేనేజర్ వి. సునీత ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ సర్వీసు ఉదయం 9.30 గంటలకు బయలు దేరి సాయంత్రం 6.00 గంటలకు శ్రీశైలం చేరుకునేది. దీనివల్ల భక్తులకు అదే రోజు స్వామివారి దర్శనం కాక, మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సి వచ్చేది. భక్తుల కోరిక మేరకు ఈ బస్సును ఉదయం 7.20 గంటలకు మార్చినట్లు తెలిపారు. కొత్త సమయం ప్రకారం ఈ బస్సు మధ్యాహ్నం 3.30 గంటలకే శ్రీశైలం చేరుకుంటుందన్నారు. భక్తులు అదే రోజు సాయంత్రం దర్శనం ముగించుకుని, మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు తిరుగు ప్రయాణంలో ఇదే బస్సులో సూర్యాపేటకు చేరుకోవచ్చన్నారు. ఈ ప్రయాణ మార్పులు ఈనెల 27 (నేటి) నుండి అమలులోకి వస్తుందన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్**: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో లబ్ధిదారుల ఇళ్లను గురువారం ప్రారంభించారు.మండలంలోని అల్వాల,ఎల్లపురం గ్రామాల్లో జరిగిన ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి లింగారెడ్డి,హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్షం రాజు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/నూతనకల్** : మన గ్రోమోర్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దనెమిల గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూర్యాపేట జిల్లా మన గ్రోమోర్ ఏరియా మేనేజర్ బాల ప్రతాప్, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ ఆరోగ్య భీమా పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన గంగుల వీరయ్య మన గ్రోమోర్ కేంద్రంలో ఐసిఐసిఐ పాలసీ భీమా పాలసీ తీసుకొని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.2లక్షల భీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ బొడ్డుపల్లి అంజయ్య, ఉపసర్పంచ్, సురేష్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# పేదల పక్షపాతి ధర్మభిక్షం









**ప్రజాపక్షం/చందూరు:** స్వాతంత్ర సమరయోధుడు, గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం చందూరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆ మహానీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్ల సత్యనారాయణ, గుండు వెంకట్ గౌడ్, అనంత నర్సింహ్మా, దశరథ, మోదాల వెంకన్న, బొడ్డ సతీష్ గౌడ్, బోడ వెంకటేశం, బుచ్చాల ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బంగారిగడ్డ చౌరస్తాలో...** మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రజల మనిషి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లరాజు రామలింగయ్య అన్నారు. కామ్రేడ్ ధర్మబిక్షం 15వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ బంగారిగడ్డ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని రోడ్డ్యాం వద్ద ఉన్న అమరజీవి ధర్మబిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్, మాజీ జడ్పిటిసి మాదగోని విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య, బిక్షమయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రామన్నపేట:** 2011 మార్చి 26న గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం మరణించారని, భౌతికంగా వారు దూరమైనా బడుగు, బలహీన వర్గాల మనసుల్లో, గీత పనివారల గుండెల్లో,జీవితాల్లో కలకాలం ఉండిపోతారని,ఆయన చేసిన త్యాగం అలాంటిదని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ అన్నారు. నివాళులర్పించిన వారిలో గీత పనివారల సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకటేశం, సంఘం సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ మాట్లాడుతూ ధర్మభిక్షం నైజాం ప్రభుత్వాన్ని గద్దె దించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్,మండల నాయకులు అయితగోని వెంకటయ్య,వేముల సత్తయ్య,కర్నాటి అంజయ్య,ఎరుకల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోటకొండూర్:** ప్రజల కోరకు తన జీవితమే త్యాగం చేసిన ప్రజల మనిషి బొమ్మగాని ధర్మబిక్షం అని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూర్ మండల కేంద్రంలో బొమ్మగాని ధర్మక్షం 15వ వర్ధంతి సందర్భంగా సిపిఐ మండల సమితి ఆధ్వరంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యంతో కలిసి ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, సిపిఐ మోటకొండూర్ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి జీవికెలపల్లి పాండు, ఏఐవైఎఫ్ అధ్యక్షులు బీరకాయల మధు, ఎండి గుంశీ, ఎర్ర కృష్ణయ్య, బీరకాయల పోశయ్య, మొగిలి పాక యాదయ్య, తంబాల మధు, బీరకాయల రాములు, వడ్డబోయిన అచ్చయ్య, రాములు మొగిలిపాక బిక్షపతి, బీరకాయల మైసయ్య, బీరకాయలు సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోతె:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మాజీ ఎంపిపి, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మబిక్షం 15వ వర్ధంతి కార్యక్రమంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బొడ్డు సాలయ్య గౌడ్, అయితబోయిన వెంకన్న గౌడ్, బొడ్డ రామచంద్రు గౌడ్, జలగం ఆంజనేయులు, గోపి గౌడ్ పాల్గొన్నారు.





## పోలీసు సిబ్బందికి ఆర్థిక బాసటగా పోలీస్ సబ్సిడీ క్యాంటీన్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పోలీసు సబ్సిడరీ సెంట్రల్ క్యాంటీన్ పోలీస్ సిబ్బంది యొక్క ఆర్థిక అవసరాలకు బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాల యంలో నిర్వహిస్తున్న కాప్స్‌మార్ట్ సబ్సిడరీ పోలీస్ క్యాంటిన్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన పప్పు దినుసులు, ఎలక్ట్రానిక్ వస్తువుల విభాగాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని సిబ్బంది అవసరాలకు అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. క్యాంటీన్ నందు వస్తువులు బయట వ్యాపార సముదాయాలతో పోలిస్తే చాలా తక్కువ రేట్లకు సిబ్బందికి అందిస్తున్నామని అన్నారు. పోలీసు సిబ్బంది ఈ సబ్సిడరీ క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, ఏఆర్ డిఎస్‌పి నరసింహచారి, ఆర్‌ఐలు ప్రవీణ్, జానయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా కళ్యాణ మహోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం అంగరంగ వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన మండపాన్ని పలు పుష్పాలతో చక్కగా అలంకరించారు. ఈ కళ్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రెంటల సతీష్ శర్మ, దుర్గాప్రసాద్ నిర్వహించారు. అనంతరం భక్తులకు కళ్యాణ అక్షతలను, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని ఆలయ నిర్వాహకులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు అనంతుల గణేష్ రామలింగయ్య, అనంతుల సూర్యనారాయణ, అనంతుల సందీప్ కుమార్, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వెంపటి పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ప్రవేశ పరీక్ష ఏదైనా ఫలితాలలో జిల్లాలో ప్రథమ స్థానం సాధిస్తూ వెంపటి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ ప్రభంజనాన్ని చాటుతున్నారని ప్రధానోపాధ్యాయులు చిత్తలూరి వెంకటనర్సమ్మ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టిజి సెట్ 2026 ప్రవేశ పరీక్షల ఫలితాల్లో అర్హత సాధించిన విద్యార్థులను ఆమె గురువారం అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నప్పటికి విద్యార్థులు క్లిష్టపరిస్థితులను ఎదుర్కొన్నా తమ లక్ష్యాలను సాధించారన్నారు. దీనికి కారకులైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లెపాక రవీందర్, గుడ్ల ఆంజనేయులు, అనిల్ కుమార్, విక్రమ్, మాలోతు కృష్ణ, గట్టు మాదవి, నవీన్, భవాని, మౌనిక పాల్గొన్నారు.

## శ్రీసీతారాముల ఎదుర్కోళ్ళు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** శ్రీరామనవమి శ్రీసీతారామ కళ్యాణ మహోత్సావన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అలంకార్ బజార్ శ్రీసీతారామ వసంత కళ్యాణ మహోత్సవం 49వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తోట శ్యాంప్రసాద్, మురారిశెట్టి శ్రీధర్, కాసం జగన్, గుడిపాటి సురేష్, గోదల మల్లారెడ్డి, వీర్లపాటి రమేష్ పాల్గొన్నారు.

## నిర్మాణ సమయంలో టెలికాం సంస్థలకు సమాచారం ఇవ్వాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వివిధ శాఖల ద్వారా చేపట్టే రహదారులు, కాలువల నిర్మాణం విస్తరణ పనుల సమయంలో భూగర్భ ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ దెబ్బతినకుండా సంబంధిత టెలికాం సంస్థలకు సమాచారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో నిర్వహించిన జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పనులు చేపట్టేటప్పుడు ప్రత్యేకించి రహదారుల నిర్మాణం, ఉన్న రహదారుల విస్తరణ, మురికి కాలువల తవ్వకం వంటి సమయంలో కాల్ బిఫోర్ యు డిగ్ మొబైల్ యాప్ లో అప్లోడ్ చేయాలని చెప్పారు. ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ సంస్థలు కొత్త కవర్ల ఏర్పాటు సమయంలో రేడియేషన్ లేని టవర్ల ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఈడిస్ట్రిక్ మేనేజర్ దుర్గాప్రసాద్,ఈ ఫైబర్ జిల్లా మేనేజర్,నెట్వర్క్ కంపెనీల ప్రతినిధులతో పాటు,ఆర్డబ్ల్యూఎస్,పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ,మున్సిపల్ కమిషనర్లు ,తదితరులు హాజరయ్యారు.



## సురక్షితంగా గమ్యానికి చేర్చాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఆటోస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాల పట్ల, ప్రయాణికుల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిదానంగా నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## 24 గంటల్లో పసికందు రక్షణ

**ప్రజాపక్షం/త్రిపురారం:** అక్రమ శిశు విక్రయంపై వెలుగులోకి వచ్చిన కేసులో త్రిపురారం పోలీసులు వేగవంతంగా స్పందించి 24 గంటల్లోనే కేసును ఛేదించారు.పసికందును సురక్షితంగా రక్షించి నల్లగొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కేంద్రానికి( సీడబ్ల్యూసీ) తరలించారు.వివరాల ప్రకారం,చట్ట వ్యతిరేక దత్తత వ్యవహారం బయటపడగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ వెంటనే స్పందించి దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశారు.త్రిపురారం ఎస్ఐ కైగూరి నరేష్ వర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆపరేషన్ నిర్వహించారు.ఈదర్యాప్తులో అక్రమంగా శిశువును దత్తత తీసుకున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పసికందును సురక్షితంగా స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారుల పర్యవేక్షణలో నల్లగొండ సీడబ్ల్యూసీకి తరలించారు.ఈ ఘటనతో బాధిత కుటుంబానికి ఊరట లభించింది.తక్షణమే స్పందించి శిశువును రక్షించిన త్రిపురారం పోలీసులకు,బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ అక్రమ దత్తతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిఘా కొనసాగిస్తామని తెలిపారు.